క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

అచ్చంపేట(ఉప్పునుంతల): స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) అత్యవసర సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. సంఘం కార్యవర్గ సభ్యులు, సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

3న సర్వసభ్య సమావేశం

కల్వకుర్తిరూరల్: మండల సర్వసభ్య సమావేశం జూలై 3వ తేదీన ఎంపీపీ మనోహర అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకట్‌రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ పీఏసీఎస్ చైర్మన్, ఎంపీటీసీలు, పంచాయతీ ప్రత్యేకాధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

అచ్చంపేట(మన్ననూర్): గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని అప్పుడే గోజాతి మనుగడ సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంబు వెంకటరమణ కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించకపోతే అంతరించే ప్రమాదం ఉందన్నారు. గో మూత్రం, పేడ, అంటువ్యాధులు ప్రభలకుండా దోహదం చేస్తుందన్నారు. పేడను పంటలకు ఎరువులుగా వినియోగిస్తే అధికదిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. గోవు సంతతిని కాపాడుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు

నాగర్‌కర్నూల్(తాడూరు): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు పదోన్నతి పొందారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు బలాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు, వెంకటయ్య కోడేరు మండలం పసుపుల పాఠశాలకు, శివలీల జొన్నలబొగుడ, ఆనంద్ బిజినేపల్లికి పదోన్నతు పొంది బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారికి పదోన్నతికి సంబంధించిన పత్రాలను అందజేశారు.

14వ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీలు

అచ్చంపేట(ఉప్పునుంతల): మండలంలో శుక్రవారం నుంచి 14 విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తునట్లు ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. మార్చి 1, 2023 నుంచి ఏప్రిల్ 31, 2024 వరకు ఈజీఎస్‌లో రూ. 4.80 కోట్లతో చేపట్టిన పనులపై తనిఖీలు ఉంటాయని ఏపీఓ పేర్కొన్నారు.

ఆర్టీసీ డీఎంకు వినతి



అచ్చంపేట(అమ్రాబాద్): పదర మండలం చెన్నపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని శుక్రవారం గ్రామస్తులు అచ్చంపేట ఆర్టీసీ డీఎం మురళీదుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. హనుమంత్‌నాయక్, బాలునాయక్, సుబ్బదాసు తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఓకు వినతి



నాగర్‌కర్నూల్: ప్రభు త్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కలెక్టరేట్ ఏఓ చంద్రశేకర్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చినపాగ శ్రీనివాసులు, నాగమ్మ, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నాగర్‌కర్నూల్(కోడేరు): మండలంలోని నర్సాయిపల్లిలో విద్యుదాఘాతానికి గుర్రై పాడి గేదె మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బండలమ్మకు సంబంధించిన గేదెను మేతకు తీసుకెళ్లి వస్తుండగా గ్రామంలో ప్రధాన రహదారి పక్కల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోక చోటుకు మార్చాలని గ్రామస్తులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.

బొగ్గుగనుల వేలం నిలిపివేయాలి

నాగర్‌కర్నూల్(నాగర్‌కర్నూల్‌రూరల్/కొల్లాపూర్/తెలకపల్లి/పెంట్లవెల్లి): సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో బొగ్గుగనుల వేలంపై నిరసన తెలిపారు. పలు మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఆందోళనలు చేపట్టారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు హాజరై మాట్లాడారు. బొగ్గుగనుల వేలం పాటను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వేలంపాటపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. తెలకపల్లిలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు హాజరయ్యారు. పెంట్లవెల్లి పాతబస్టాండ్ ఎదుట జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింత ఆంజనేయులు, ఆర్ శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, అశోక్, రామయ్య, సత్యనారాయణ, సురేష్, శివరాం, రవి, వెంకటయ్య పాల్గొన్నారు.



తెలకపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పంటల సాగు వివరాల నమోదు

అచ్చంపేట(లింగాల): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాలలో వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల నమోదును శుక్రవారం మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబట్‌పల్లి శివారులో పంటల సాగు వివరాలను ఏఈఓ శివానంద్ నమోదు చేశారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ మండలంలో 6 క్లస్టర్ల పరిధిలో ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల సాగు సమాచారం సేకరిస్తారన్నారు. ఏ సర్వే నెంబర్‌లో ఎంత విస్తీర్ణంలో రైతు ఏ రకమైన పంటను సాగు చేశారనే సమాచారాన్ని వ్యవసాయ శాఖ వారు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. రైతులు సహకరించాలని కోరారు.



పంటల సాగు వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓ

నేడు తైబజార్ వేలం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం తైబజార్ వేలం నిర్వహిస్తునట్లు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నాగశేషు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనేవారు రూ.10వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

నాగర్‌కర్నూల్(కొల్లాపూర్ రూరల్): మండలంలోని అమరగిరి, మొలచింతలపల్లి గ్రామాల్లో శుక్రవారం స్థానిక ఎక్సైజ్ అధికారులు సారా తయారు చేస్తున్న స్థావరాలపై దాడులు చేశారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే మొలచింతలపల్లిలో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో సారా వల్ల కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది చెన్నగౌడ్, మహేష్, మంజుల, వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

కల్వకుర్తిరూరల్: అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను శుక్రవారం ఆయన పట్టణాధ్యక్షుడు నర్సింహ, రాష్ట్ర నాయకుడు రాంభూపాల్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన వారికి వెంటనే డబుల్‌బెడ్రూం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకంలో భాగంగా ఇండ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. రాఘువేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, బాబిదేవ్, విజయ్, గంగాధర్, చందుముదిరాజు, రాంరెడ్డితోపాటు పలువురు ఉన్నారు.



డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు

నాగర్‌కర్నూల్(వెల్దండ/తాడూరు/అచ్చంపేట రూరల్): బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు వస్తుందని వెల్దండ, తాడూరు ఎంఈఓలు శంకర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న జి. అశోక్‌రెడ్డి, తాడూరు మండలంలోని ఐతోల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మీకాంతారావు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. అచ్చంపేట మండలం నడింపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు మామిళ్ల సుదర్శన్ పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా, ప్రస్తుతం బీసీ వెల్ఫేర్ సహాయ అధికారిగా పనిచేస్తున్న శ్రీధర్ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని సుఖజీవన్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెల్దండ పాఠశాల హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ సంతోషిమాత దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా ఉదయం ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం, అలంకరణ చేశారు. మహిలు సామూహిక కుంకుమార్చన ఉద్యాపనం, కలశ పూజలు, వడి బియ్యం, డోలారోహనం నిర్వహించారు. లలితా సహస్ర పారాయణ పఠనం, లింగాష్టకం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. అమ్మవారికి ప్రత్యేకంగా నైవేద్యాలు నివేదన, మహా మంగళహారతి చేశారు. సామల కొండయ్య, బి. సత్యనారాయణ దంపతులు వేర్వేరుగా రూ.10116 లు అన్నదానానికి విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు అల్లాడి ప్రకాష్ శర్మ, కమిటీ సభ్యులు మాలిపెద్ది భాగమ్మ, పెద్దమారూర్ రాజేశ్వరి, రాచేర్ల శివ కుమార్, వేణుగోపాలరావు, నందకిషోర్, భక్తులు సరస్వతి, రాజేశ్వరి, జ్యోతి, రమాదేవి, శ్రీదేవి, అరుణ బాలిశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్ర సమీపంలోనీ కొల్లాపూర్ చౌరస్తా దగ్గర జ్ఞాన సరస్వతి దేవాలయంలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన, సామూహిక లలితా సహస్ర నామ స్తోత్రం పఠనం నిర్వహించారు. భక్తులకు వేద ఆశీర్వచనం తోపాటు తీర్థ ప్రసాద పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పెంటమ్మరాజు నవీన్ శర్మ, కమిటీ సభ్యులు ఎలిమే ఈశ్వరయ్య, దొడ్ల ఇందుమతి, ఆకారపు విశ్వనాథం, దొడ్ల నారాయణరెడ్డి, రమాదేవి, లతా, భక్తులు పాల్గొన్నారు.

పింఛన్ హామీ నెరవేర్చాలి

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చారని వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు కోట్ల గౌతం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.300 లను రూ.3 వేలకు పెంచాలని కోరుతూ జూలై 3న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట నిర్వహించ ధర్నా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతువులు, వృద్ధులకు రూ.4 వేలు ఇవ్వాలని కోరారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

నాగర్‌కర్నూల్: తాడూర్ మండలంలోని సిర్సవాడలో మర్రి ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ నిధుల ద్వారా కొత్తగా అన్ని మౌలిక సదుపాయాలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం నిర్మించినట్లు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఇటీవల స్కూల్ ప్రారంభించిన సమయంలో పాఠశాల ప్రధాన బోర్డుపై తమ కంపెనీ లోగో, పేరును తొలగించినట్లు మాజీ ఎమ్మెల్యే కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ప్రారంభోత్సవ సమయంలో తమ కంపెనీ లోగో, పేరు మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న గృహజ్యోతి నమోదు



చారకొండ: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఐదు రోజులుగా ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీకి దరఖాస్తు చేసుకుంటున్నారు. పలు గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. అధికారులు దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ మాట్లాడుతూ అర్హులందరూ గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేట : దేశవ్యాప్తంగా నీట్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సయ్యద్ అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని తెలంగాణ అమరవీరుల స్తూపం ఎదుట నిరసన తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు, సుల్తాన్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిర్భూమికి వెళ్లి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి(కోడేరు): బహిర్భూమికి వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సాకలి చంద్రయ్య(50) కొన్నేళ్ల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఉదయం ఊరి శివారులో ఉన్న రేడ్డికుంట దగ్గరకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడికి భార్య శివలీల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మట్టి నమూనాల సేకరణ



వెల్దండ: రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని ని పంటలను సాగుచేసుకోవాలని ఏఈఓ గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలం పెద్దాపూర్‌లో ఏఈఓ భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించారు. భూసార పరీక్షలతో పంటలను సాగుచేసి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలి



నాగర్‌కర్నూల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న బోజనం పథకం అమలు చేయాలని బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఐఓ వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగుబలహీన వర్గాల విద్యార్థులకు మేలు చేయాలని కోరారు. అనంతరం డీఐఈఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చందు, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెం పీహెచ్‌సీలో ఆపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రైతులు హాజరవ్వాలి

నాగర్‌కర్నూల్(తెలకపల్లి): మండల కేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో రైతులకు, రైతుభాగస్వామ్యం సంఘ సభ్యులకు శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ ద్యాసాని భాస్కర్‌రెడ్డి, సీఈఓ ధర్మవీర్ శుక్రవారం తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అచ్చంపేట(అమ్రాబాద్): సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2:00 గంటలకు నిర్వహిస్తునట్లు శుక్రవారం ఎంపీడీఓ మోహన్‌లాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



కల్వకుర్తిరూరల్: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గృహజ్యోతి పథకంలో 18 వేల మంది దరఖాస్తు చేస్తే 6 వేల మందికే అర్హత లభించడం దారుణమన్నారు. పథకాలు అమలు చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, పర్వతాల్‌యాదవ్‌లు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కల్వకుర్తిరూరల్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన మహిళ నిరంజన్‌బేగం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చికిత్స నిమిత్తం రూ.4.50 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ మేరకు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఎల్ఓసీని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్, నిజాముద్దీన్, శానవాస్ కాన్, హరిదాసు, రేశ్మ, భాస్కర్, జలాల్, యాదయ్య, గంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన

అచ్చంపేట(మన్ననూర్): అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో వానాకాలం సాగు చేస్తున్న పత్తి పంటలను శుక్రవారం ఏఈఓ సీతారాం పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి సాగుకు అవసరమైన మెలకువలు, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. పత్తి పంట సాగు చేస్తున్న విస్తీర్ణాన్ని బట్టి నత్రజని, భాస్వరం, పొటాషియం సిఫారసు చేసిన ఎరువులను దుక్కిలో లేదా విత్తనం విత్తిన 15 రోజుల లోపల తగు మోతాదుల్లో వేసుకోవాలని సూచించారు. భాస్వరం వేయడం ద్వార వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెంది మొక్కలు బలంగా పెరగడానికి అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది ఉన్నారు.



వటువర్లపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

పైపులైన్‌కు మరమ్మతు చేపట్టండి

నాగర్‌కర్నూల్(తాడూరు): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పైపులైన్ పగిలి తాగునీరు వృథాగాపోతోంది. నీరు ఒకేచోట నిల్వ ఉండటంతో తిరిగి పైప్‌లైన్‌లోకి చేరి నల్లాల ద్వారా సరఫరా అవుతోంది. మండలంలోని యంగంపల్లి, మేడిపూర్ దగ్గర పైపులైన్ దెబ్బతింది. 20 రోజుల నుంచి నీరు వృథాగా పారుతున్న అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని యంగంపల్లి మాజీ సర్పంచ్ కృష్ణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. వర్షాలు ప్రారంభంకావడంతో నీరు కలుషితం అయి అంటురోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



యంగంపల్లి దగ్గర పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

మాజీ ప్రధాని పీవీ సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్

కొల్లాపూర్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు దేశానికి అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కొల్లాపూర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద పీవీ 103వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పీవీ చిత్రపటానికి మంత్రి, కలెక్టర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. పీవీ హయాంలో చేపట్టిన ఆర్థిక సంస్కరణలతోనే నేడు దేశం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఆయన దేశ సంక్షేమం కోసం ఎన్నో గొప్ప నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. కవి రచయితగా, బహుభాషా కోవిధునిగా, రాజకీయ నీతిజ్ఞునిగా ఆయన అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగరాజు, నాయకులు హన్మంతు నాయక్, రహీంపాష, నయూమ్, ఎక్బాల్, ఖాదర్‌పాష తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలో మాజీ ప్రధాని పీవీ నరసింహరావు జయంతిని శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న పీవీ విగ్రహానికి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలో ఆర్థికవ్యవస్థతో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత పీవీకే దక్కుంతుందని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునేంద్ర, బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని పీవీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలి తెలుగు ప్రధాని, గొప్ప ఆర్థిక సంస్కరణ వేత్త, తెలంగాణ ముద్దు బిడ్డ, బహుభాషావేత్త పీవీ నరసింహారావు అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

బీజేపీ ఆధ్వర్యంలో...

పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు పీవీ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహరావు జయంతి వేడుకలను నిర్వహించారు. మోతిలాల్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పర్వత్‌రెడ్డి, తక్కళ్లపల్లి శేఖర్, మట్ట వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, నాయకులు శంకరయ్య, జైరానాయక్, వెంకటయ్య ఉన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి